క్లుప్తంగా

జగన్‌ను కలసిన వైఎస్సార్ సీపీ యువ నేతలు



జగన్‌ను మర్యాద పూర్వకంగా కలసిన యువ నేతలు శ్రీకృష్ణ, సత్యకృష్ణ

మండపేట: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు చోడే సత్యకృష్ణ , విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణలు బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం మండపేట నియోజకవర్గంలోని పరిణామాలపై వారిద్దరూ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా సత్యకృష్ణ, శ్రీకృష్ణలు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమికి అధైర్య పడవద్దని, త్వరలోనే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని జగన్ తమకు ధైర్యం చెప్పారన్నారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని తమకు సూచించారని వారన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దాతలు

కె.గంగవరం: విశాఖపట్నానికి చెందిన మల్లికార్జున ట్రాన్స్‌పోర్టు యజమాని భాజంకి సోమేశ్వరరావు సుమారు రూ.30 వేల విలువైన నోటు పుస్తకాలు, కాపీ పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని ఐదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం అందజేశారు. అముజూరు సర్పంచ్ నానాపరపు కల్యాణి, శ్రీనివాస్ దంపతులు, కూళ్ల సర్పంచ్ చెల్లి నాగేశ్వరరావు దాతను అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పి.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, ఎస్.వెంకటరమణ, జె.ప్రేమ్‌కుమార్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలి



కపిలేశ్వరపురంలో వాటర్ ట్యాంక్ ఆవరణను శుభ్రం చేసే పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ కొండలరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వర్షాకాలం ప్రవేశిస్తున్న నేపథ్యంలో పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా జాగ్రత్త పడాలని, ఒక వేళ ఉన్నట్టయితే వెంటనే మరమ్మతు చేసి సురక్షిత తాగునీటిని ప్రజలకు అందజేయాలని ఆదేశించారు. ఆ మేరకు బుధవారం కపిలేశ్వరపురంలో చేపట్టిన ట్యాంకు పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలోని 19 గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను కార్యదర్శుల పర్యవేక్షణలో శుభ్రం చేశారు.

మయూరి వృద్ధాశ్రమంలో అన్నదానం

మండపేట: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ధర్మగుండం చెరువు వెనక గల మయూరి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఏఐసీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో రాహుల్ గాంధీ బర్త్‌డే కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీలో పామర్రు ప్రథమం

రామచంద్రపురం రూరల్: మండలంలోని పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ వై.అంజిబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. 38 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 31 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

గోశాలకు దాణా వితరణ



కోటిపల్లిలో గోశాలకు దాణా అందజేస్తున్న ఏడీ రామకృష్ణ, వైద్యులు, సిబ్బంది

కె.గంగవరం: కోటిపల్లి సోమేశ్వరస్వామి దేవస్థానం గోశాలకు పశు సంవర్థక శాఖ అధికారులు, సిబ్బంది రూ.10 వేల విలువైన కనికల దాణా బస్తాలను దేవస్థానం ఈఓ శ్రీదేవికి అందజేశారు. ఆ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోటూరి రామకోటేశ్వరరావు పుట్టిన రోజు పురస్కరించుకుని దీనిని అందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఓ.రామకృష్ణ, మండల వైద్యాధికారులు డాక్టర్ బిందు, డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున్, డాక్టర్ సురేష్, దేవస్థానం గుమస్తా జి.పెద్దయ్య, సిబ్బంది, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

బస్ పాస్‌ల జారీ సీజన్ ఇది..

- ఉచిత, రాయితీ బస్ పాస్‌లు మంజూరు చేస్తున్న ఆర్టీసీ
- 7వ తరగతి వరకూ బాలురకు, టెన్త్ వరకూ బాలికలకు ఉచితం
- పట్టణాలకు వెళ్లి చదువుకునే గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం



ఆర్టీసీ బస్సు

రాయవరం: విద్యార్థులపై చార్జీల భారం తగ్గించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఏటా ఉచిత, రాయితీ పాసులు ఇస్తోంది. రెండు నెలల సెలవుల తరువాత తిరిగి విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్ పాస్ కౌంటర్లు ప్రారంభించారు. స్థానికంగా సరైన విద్యాసంస్థలు లేకపోవడం, హాస్టల్ సీటు రాకపోవడం, గది అద్దెకు తీసుకునే ఆర్థిక స్తోమత లేకపోవడం వంటి కారణాలతో విద్యార్థులు బస్ పాసులు పొంది రాకపోకలు సాగిస్తుంటారు. రామచంద్రపురం డిపో పరిధిలో విద్యార్థులు ఆర్టీసీ బస్ పాస్‌లు పొంది ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తూ చదువుకుంటున్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ సంస్థల్లో చదివే విద్యార్థులకు పాసులు మంజూరు చేస్తారు.

ఇవీ నిబంధనలు

ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల విద్యార్థుల 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సెల్ నంబర్ ఇవ్వాలి. దరఖాస్తులను డిపో మేనేజర్ పరిశీలించి పాసు మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని మంజూరు కౌంటరులో ఇచ్చి నిర్ణీత సొమ్ము చెల్లించి పాసు పొందవచ్చు. విద్యార్థులు చదివే విద్యాసంస్థల సమీపంలోని బస్ డిపోల్లో పాసులు పొందవచ్చు.

ఉచిత బస్ పాసులు ఎవరికిస్తారంటే?

అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు 7వ తరగతి వరకూ బాలురు, 10వ తరగతి వరకూ బాలికలకు ఉచితంగా బస్ పాసులు ఇస్తారు. ఇవి ఏడాది వరకూ చెల్లుబాటు అవుతాయి. మిగతా వారికి రాయితీతో పాసులు మంజూరు చేస్తారు. పాస్ ధరతో పాటు ఏడాది గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు కోసం రూ.50, సర్వీసు చార్జీ కోసం రూ.40 విద్యార్థులు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

పాస్‌ల కాల పరిమితి

రాయితీ పాసులు నెల, మూడు నెలలు, ఏడాది కాల పరిమితితో మంజూరు చేస్తున్నారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని వెళ్లాలి. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకు, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, బీఈడీ, మెడిసిన్, పారా మెడికల్ లాంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాసులు మంజూరు చేస్తారు. ప్రతి 5 కి.మీలకు ఒక స్టేజీగా పరిగణనలోకి తీసుకొని దూరాన్ని బట్టి రాయితీ కల్పిస్తారు.

రామచంద్రపురం డిపో పరిధిలో..

రామచంద్రపురం డిపో పరిధిలో రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం , కె.గంగవరం మండలాల విద్యార్థులతో పాటుగా, ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా బస్‌పాస్‌లు పొందుతున్నారు. ఈ నెల 12 నుంచి నూతన బస్‌పాస్‌ల మంజూరు ప్రారంభించారు. కాగా గత విద్యా సంవత్సరంలో ఈ డిపో పరిధిలో 12 ఏళ్ల లోపు బాలురు, 18ఏళ్ల లోపు బాలికలకు ఉచిత బస్సు పాసులు 8,100, స్టూడెంట్ రాయితీ బస్‌పాస్‌లు సుమారు 18 వేలు మంజూరు చేశారు. మంత్లీ సీజన్ పాసులు 2,340, దివ్యాంగుల రాయితీ పాసులు 1,250 మంజూరు చేశారు. కొత్తగా బస్‌పాస్‌లు పొందే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్//ఆన్‌లైన్.ఏపీఎస్ఆర్టీసీ.ఇన్ నందు రిజిస్టర్ చేసుకోవాలి. బస్‌పాస్ అప్లికేషన్‌పై కళాశాల ప్రిన్సిపాల్‌తో సర్టిఫై చేయించుకుని వస్తే వెంటనే బస్‌పాస్ జారీకి చర్యలు చేపడుతున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం అందించే బస్ పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం నెలవారీగా, మూడు నెలలు, ఏడాది కాల పరిమితితో పాస్‌లు ఇస్తున్నాం. దరఖాస్తుకు ఆధార్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్సులు, కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా జిరాక్సును జత చేసి సమీపంలోని కౌంటర్‌లో సమర్పించి, పాసులు పొందవచ్చు. 50 కి.మీ పరిధి వరకు బస్సు పాసులు మంజూరు చేస్తున్నాం.

– కె.వెంకటేశ్వర్లు, డిపో మేనేజరు, రామచంద్రపురం

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోండి



సురేష్‌కుమార్, తహసీల్దార్, మండపేట

మండపేట: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు, రైతు పట్టా భూముల్లో జరిగే మట్టి, గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల నుంచి కొందరు అక్రమంగా గ్రావెల్‌ను తరలించుకు పోతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి తవ్వకాలను నిలుపుదల చేసేందుకు వీఆర్వోలను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఆ దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని వీఆర్వోలను ఆదేశించారు. అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలించే వాహనాలను వీఆర్వోలు, వీఆర్ఏలు తనిఖీ చేయలన్నారు. మైనింగ్ ఉన్న గ్రామం నుంచి వెళ్లే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేసి వాటికి అనుమతులు ఉన్నాయా లేదా అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని తహసీల్దార్ సురేష్‌కుమార్ హెచ్చరించారు.

నేడు సాయిబాబాకు విశేష పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు గ్రామంలోని సాయిబాబాకు గురువారం విశేష పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ 13వ వార్షికోత్సవంలో భాగంగా బాబాకు క్షీరాభిషేకం, ప్రత్యేక హారతి తదితర పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

తొలకరికి సమృద్ధిగా ఎరువులు

కాజులూరు: తొలకరిలో రైతులకు కావలసిన ఎరువులు సమృద్ధిగా అందజేసేందుకు వ్యవసాయ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తుందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. బుధవారం గ్రామంలో ఆయన రైతులతో మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది తొలకరిలో 18,078 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టనున్నారన్నారు. ఇందుకు మొత్తం 4,519 టన్నుల ఎరువులు అవసరమవుతాయన్నారు. తొలకరి తొలి దశకు 1,039 టన్నుల ఎరువులు అవసరం కాగా, ఆర్బీకేలు, ప్రైవేటు ఎరువుల షాపులు, డీలర్ల వద్ద సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

రామచంద్రపురం రూరల్: నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.సిద్ధూ బుధవారం డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాయపాలెంలో గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయం వద్ద సిద్ధూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలన్నారు. అదే విధంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలన్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని, గుర్తింపు లేని పాఠశాలను మూసివేయించాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.భానుతేజ, వి.సుమంత్, ఎ.రేవంత్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు



ఐదేళ్ల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందిస్తున్న సిబ్బంది

కాజులూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు ఏర్పడతాయని గొల్లపాలెం అంగన్‌వాడీ సెక్టారు నాయకులు కె.వసంతకుమారి, టి.వరలక్ష్మి అన్నారు. సీడీపీఓ ఆదేశాల మేరకు బుధవారం గొల్లపాలెం సెక్టారు పరిధిలోని 26 అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి, వరలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన చేస్తున్నామన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మూడు నుంచి ఆరేళ్ల వరకు గణనీయంగా ఉంటుందని చెప్పారు. ఈ వయస్సులో వారికి నేర్పే ప్రతి విషయం వారి భవిష్యత్తుకు బాటగా మారుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన చిన్నారులకు ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందించి స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో సెక్టారు నాయకులు వీవీఎస్ నాగమ్మ, ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీజీవో మండపేట నూతన కార్యవర్గ ఎన్నిక



ఏపీ ఎన్జీజీ మండపేట యూనిట్ నూతన కార్యవర్గం

మండపేట: ఏపీ ఎన్జీజీవో మండపేట యూనిట్ అధ్యక్షుడిగా జె.మల్లికార్జునుడు ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీ ఎన్జీజీవో మండపేట శాఖ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకారం జరిగాయి. జిల్లా నాయకుల పర్యవేక్షణలో యూనిట్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఉపాధ్యక్షుడిగా అమర్‌నాథ్ చౌదరి, సంయుక్త కార్యదర్శులుగా కోరుకొండ శ్రీనివాస్, సుబ్బారావు, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా జి. పద్మలత, కోశాధికారిగా గోపాల్ ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీజీవో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి పేపకాయల కృష్ణ, జిల్లా సహాధ్యక్షుడు చెర్రిల చంద్రరావు, మండపేట ఈవోపీఆర్డీ ఐదం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే



చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేలో అంగన్‌వాడీ టీచర్లు

రామచంద్రపురం: రామచంద్రపురం అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అర్బన్ పరిధిలోని 18 సెంటర్లలో ఉన్న విద్యార్థులకు గొల్లడొంకల వీధి అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ టీచర్ల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ వీవీవీ వరాహలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ప్రోత్సహించి, ఐదేళ్లు పూర్తయిన 22 మంది చిన్నారులను మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించామన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం మదుర మీనాక్షి, ఎంఈఓ-2 వి నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

వెలంపాలెం సెక్టార్‌లో..



వెలంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే

రామచంద్రపురం రూరల్: వెలంపాలెం సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ వీవీ వరలక్ష్మి, ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి, ఏఎన్‌ఎంలు ఎన్.నాగమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజరు ఐ.కల్యాణి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య



కపిలేశ్వరపురం మండలం నేలటూరులో గ్రాడ్యుయేషన్ చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు



మాచవరంలో నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్ డేలో సీడీపీవో గజలక్ష్మి తదితరులు

- ఐసీడీఎస్ మండపేట సీడీపీఓ గజలక్ష్మి
- ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే, మన అంగన్‌వాడీ పిలుస్తోంది

రాయవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నామని, కార్పొరేట్ స్కూల్స్ తరహాలో ఇక్కడ బలవంతపు విద్య ఉండదని ఐసీడీఎస్ మండపేట సీడీపీఓ గజలక్ష్మి అన్నారు. మాచవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మండల స్థాయి గ్రాడ్యుయేషన్ డే, మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో లభించే ఎల్‌కేజీ, యూకేజీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అందిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలను సాకుతున్న తీరును పలువురు తల్లిదండ్రులు వివరించారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తర్వాత మన అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సీహెచ్ సుబ్బలక్ష్మి, జీఎంఎస్‌కే కె.అనిత, సూపర్‌వైజర్లు వి.విష్ణుకుమారి, ఎం.పెర్సి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు ఆయాలు, తల్లులు హాజరయ్యారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బుధవారం చిన్నారుల గ్రేడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులను ఒకటో తరగతిలో చేర్పించారు. గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో చిన్నారులు అలరించారు. అనంతరం ×అంగన్‌వాడీ పిలుస్తుంది× పేరుతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు మాట్లాడుతూ మూడో సంవత్సరంలోకి ప్రవేశించిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. చిన్నారులను సంరక్షించిన అంగన్‌వాడీ కార్యకర్తలు జి.బేబి, ఎ.శ్రీగౌరి, ఆయాలను అభినందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య కార్యకర్త పి.సునీత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

కొత్తపేట: విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పెద్దిరాజు బుధవారం తెలిపారు. ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, ఐటిక్ సాఫ్ట్‌వేర్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. మొత్తం ఖాళీలు 316 ఉన్నాయన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేస్తారని చెప్పారు. నిరుద్యోగుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గ్రామాల్లో రెవెన్యూ దినోత్సవం

మండపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ సురేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ దినోత్సవం నిర్వహణకు మండలంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 20న రైతులు, ప్రజలతో సభను నిర్వహిస్తామన్నారు. వివిధ అవసరాలల కోసం రెవెన్యూ శాఖ జారీ చేసే ధ్రువపత్రాలు, భూ వ్యవహారాల వంటి అంశాలపై వారికి అవగాహన కల్పిస్తామన్నారు. అదే రోజున రెవెన్యూ శాఖలో పని చేసి రిటైరైన ఉద్యోగులను సన్మానిస్తామని చెప్పారు. మండలంలోని ప్రతి పంచాయతీ కార్యాలయం వద్దా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ప్రాణాంతక మహమ్మారి సికిల్ సెల్

వ్యాధిపై పలు పీహెచ్‌సీల పరిధిలో అవగాహన కార్యక్రమాలు



వెదురుపాకలో సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



అచ్యుతాపురంలో వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కరుణేంద్రకుమారి

రాయవరం: నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలనే బలిగొనే ప్రాణాంతక మహమ్మారి సికిల్ సెల్ అని అయితే ఈ వ్యాధిని ముందుగా గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.అనిరుధ్, శ్రీనివాస్, మణికంఠ అన్నారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో బుధవారం సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సికిల్ సెల్ వ్యాధి రాకుండా నియంత్రించవచ్చన్నారు. ఒక వేళ వ్యాధి లక్షణాలకు కారణమైన అంశాలను గుర్తించకుంటే సంతానంలో పిల్లలకు వ్యాధి సంక్రమించడానికి అవకాశం ఉందన్నారు. మనిషి శరీరంలో కొడవలి లాగా వంకర తిరిగి ఉన్న ఎర్ర రక్త కణాలనే సికిల్ సెల్ అంటారన్నారు. సికిల్ సెల్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని వెదురుపాక, రాయవరం, మాచవరం, సోమేశ్వరం తదితర గ్రామాల్లో సికిల్ సెల్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాజర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: సికెల్ సెల్ ఎనీమియా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణేంద్రకుమారి అన్నారు. అచ్యుతాపురం, కాలేరు గ్రామాల్లో బుధవారం ఈ వ్యాధిపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. వ్యాధి లక్షణాలను త్వరితగతిన గుర్తించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చన్నారు. ఎర్ర రక్త కణాలను తీవ్రంగా దెబ్బతీయడంతో ఆరోగ్యం పాడవుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈఓ గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, వెంకటరమణ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.